సాక్షి
కర్నూలు
శుక్రవారం । 23 । మే । 2025




చట్టాలపై అవగాహనతోనే రాణింపు

చట్టాలపై అవగాహనతోనే న్యాయవాద వృత్తిలో రాణించవచ్చునని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ అన్నారు. 10లో▸



ఖాళీ కుర్చీల 'మహా'నాడు

నంద్యాల జిల్లా స్థాయి మహానాడు వెలవెలబోయింది. ఏర్పాట్లకు తగ్గ మేరకు పార్టీ శ్రేణులు రాకపోవడంతో టీడీపీ నేతలు నిరాశ చెందారు. 10లో▸



నల్లమలలో మీదుగా 'నంబాల'

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు ప్రయాణం నల్లమల మీదుగా సాగింది. 10లో▸

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు వరద నీరు



హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి వరద నీరు వస్తోంది. డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, తీర్థనహళ్లి, చిక్క మంగళూరు, వరనాడు, శృంగేరి తదితర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో డ్యామ్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 1,633 అడుగులుండగా గురువారం 1,588.80 అడుగులు నమోదైంది. నీటి నిల్వ పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 10.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 9,993 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో రూపంలో 2,100 క్యూసెక్కులు వదులుతున్నారు.

శ్రీమఠంలో భక్తుల సందడి



శ్రీమఠం కారిడార్‌లో భక్తుల రద్దీ

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. గురువారం ప్రత్యేకం కావడంతో రాఘవేంద్రస్వామి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో రావడంతో మంత్రాలయ క్షేత్రం కళకళలాడింది. తుంగభద్ర నదికి వరద నీరు రావడంతో నదీతీరంలో భక్తుల కోలాహలం కనిపించింది. భక్తులు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, తర్వాత రాఘవేంద్రుల మూల బృందావన దర్శనాలు చేసుకున్నారు. రాఘవేంద్రుల దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. అన్నపూర్ణభోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లతో భక్తులు బారులు తీరారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.5లక్షల విరాళం



వివిధ పథకాలకు విరాళాలు అందించిన దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు గురువారం హైదరాబాద్‌కు చెందిన ఎం.శివాజీ రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. అన్నప్రసాద వితరణకు రూ. 2 లక్షలు, గో సంరక్షణ నిధి పథకానికి రూ.2లక్షలు, ప్రాణదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు రసీదు, లడ్డు ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

స్థానిక సంస్థలపై 'కూటమి' కుట్ర

- స్టాంప్ డ్యూటీ జమ కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు?
- జెడ్పీకి సర్దుబాటు కాని అపోర్షన్డ్ మొత్తం రూ.4.13 కోట్లు
- అపోర్షన్డ్ చేయని మొత్తం దాదాపు మరో రూ.6 కోట్లు
- ప్రధాన ఆదాయ వనరుపై దెబ్బకొట్టే యత్నం
- చిన్న పనులను కూడా చేపట్టలేని స్థితిలో స్థానిక సంస్థలు

జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల్లో సింహభాగం వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధుల పాలన కొనసాగుతోంది. దీంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆయా సంస్థలను ఆర్థికంగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక సంస్థలకు హక్కుగా రావాల్సిన నిధులను రాకుండా చేసేందుకు చర్యలను చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పరిధిలో చిన్న చిన్న పనులను కూడా చేసుకోలేని దుస్థితి నెలకొనింది.



కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్టాంప్ డ్యూటీపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను చేపట్టింది. దీంతో ఏడాది కాలంగా స్టాంప్ డ్యూటీ ఆయా స్థానిక సంస్థలకు జమ కావడం లేదు. జిల్లా పరిషత్‌కు స్టాంప్ డ్యూటీ నిధులను విడుదల చేయవద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఆస్తుల క్రయ విక్రయాల సమయంలో వినియోగదారులు రిజిస్ట్రేషన్ల శాఖకు స్టాంప్ డ్యూటీ కింద 6.5 శాతం చెల్లించాల్సి ఉంది. ఇందులో 5 శాతం ప్రభుత్వానికి పోగా, మిగిలిన 1.5 శాతం స్థానిక సంస్థలకు జమ చేయాల్సి ఉంది.

నయాపైసా ఇవ్వలేదు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్థానిక సంస్థలకు స్టాంప్ డ్యూటీ కింద నయాపైసా సర్దుబాటు చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలోనే కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అపోర్షన్డ్ చేసిన మొత్తం రూ.4,13,63,139 నేటికి జిల్లా పరిషత్‌కు సర్దుబాటు కాలేదు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూడా ఉమ్మడి జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నేటికీ స్థానిక సంస్థలకు తమ వాటా ఎంత మొత్తాన్ని సర్దుబాటు చేయాలనే విషయాన్ని కూడా తెలియజేయకపోవడం దురదృష్టకరం. ఈ నేపథ్యంలోనే ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు దాదాపు 141 నెలలకు సంబంధించి నేటికి అపోర్షనేట్ చేయలేదు. ఈ మొత్తం కూడా దాదాపు రూ.6 కోట్ల వరకు ఉండవచ్చని జెడ్పీ పాలకవర్గం అంచనా వేస్తోంది.

చిన్న పనులు కూడా చేపట్టలేని స్థితిలో..

స్టాంప్ డ్యూటీ సర్దుబాటు కాకపోవడంతో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ పరిధిలో చిన్న చిన్న పనులను కూడా చేపట్టలేని పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్టాంప్ డ్యూటీ మొత్తం విడుదలైతే గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, ఇతరత్రా పనులకు వినియోగించుకునే అవకాశం ఉంది. అయితే ఏడాది కాలంగా స్టాంప్ డ్యూటీ విడుదలపై నీలి నీడలు కమ్ముకున్న నేపథ్యంలో స్థానిక సంస్థలు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా జెడ్పీకి సర్దుబాటు కాని మొత్తం (రూపాయల్లో..)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	సర్దుబాటు కాని అపోర్షన్డ్ మొత్తం
ఆదోని	10,31,015
ఆలూరు	11,73,661
కల్లూరు	91,84,814
కోడుమూరు	10,71,836
కోసిగి	8,62,183
కర్నూలు	14,48,793
ఓర్వకల్	89,17,347
పత్తికొండ	4,79,173
ఆళ్లగడ్డ	12,45,232
ఆత్మకూరు	9,88,479
బండి ఆత్మకూరు	1,73,174
బనగానపల్లె	32,62,836
బేతంచెర్ల	9,57,352
డోన్	12,46,559
నందికొట్కూరు	6,26,014
అవుకు	11,31,819
ప్యాపిలి	2,98,298
శిరివెళ్ల	12,09,919
మొత్తం:	4,13,63,139

ప్రభుత్వం స్పందించాలి



స్టాంప్ డ్యూటీ జమ కాకుంటే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలి. ఆదాయ వనరులు లేకపోవడంతో చిన్న పనులు చేపట్టేందుకు కూడా వీలు లేని పరిస్థితులు ఉన్నాయి. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఏమి సమాధానం చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం స్పందించాలి. స్టాంప్ డ్యూటీపై దృష్టి సారించాలి.

– ఈ రంగనాథ్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు, ఓర్వకల్లు

రూ.4.13 కోట్లు ఇంకా సర్దుబాటు కాలేదు



స్టాంప్ డ్యూటీ సర్దుబాటుకు సంబంధించి ప్రతి మండలంలో ఒక లైజనింగ్ అధికారికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగిస్తు చేసిన ప్రయత్నంతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.9,34,68,168లు సర్దుబాటు అయ్యాయి. అలాగే 2020–21లో రూ.4 కోట్లు, 2021–22లో 5 కోట్లు, 2022–23లో రూ.5.48 కోట్లు, 2023–24లో రూ.5.02 కోట్లు సర్దుబాటు అయ్యాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అపోర్షనేట్ అయిన మొత్తం రూ.4.13 కోట్లు ఇంకా సర్దుబాటు కాలేదు. స్టాంప్ డ్యూటీ స్థానిక సంస్థలకు సర్దుబాటు అయితే వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు కనీసం అపోర్షనేట్ కూడా చేయకపోవడం ఏమిటి? దీంతో జిల్లా పరిషత్‌కు ఎంత సర్దుబాటు చేయాలనే విషయంపై కూడా స్పష్టత కొరవడింది.

– ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ చైర్మన్

స్థానిక సంస్థలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయి



ప్రభుత్వ నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో స్థానిక సంస్థలు ఆర్థికంగా నిర్వీర్యం అయిపోతున్నాయి. అంతంత మాత్రం ఆదాయం ఉన్న జిల్లా పరిషత్‌కు ఏడాది కాలంగా స్టాంప్ డ్యూటీ విడుదల కాకుంటే ఎలా? స్టాంప్ డ్యూటీ కింద స్థానిక సంస్థలకు విడుదలయ్యే 1.5 శాతం నిధులతో గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. అయితే ఈ నిధులను సర్దుబాటు చేయడంలో జరుగుతున్న జరుగుతున్న జాప్యాన్ని నివారించి వెంటనే నిధులు జెడ్పీకి జమ అయ్యేలా చూడాలి.

– ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, గడివేముల

ఆగస్టు చివరికి సారా రహిత జిల్లాగా చేయాలి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ



జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

కర్నూలు: నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా కర్నూలు జిల్లాను ఆగస్టు చివరి నాటికి నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించేలా పనిచేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారులను ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. విజయవాడ నుంచి బుధవారం రాత్రి కర్నూలు చేరుకున్న రాహుల్ దేవ్ శర్మ బీ.క్యాంప్‌లోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. గురువారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. నోడల్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా నోడల్ ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు, ఏఈఎస్‌లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, సీఐలు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్, జయరాం నాయుడు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నవోదయం 2.0 అమలు తీరు, జిల్లాలో ఉద్యోగుల పనితీరుపై సమీక్షించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి బార్డర్ చెక్‌పోస్టుల పనితీరును సమీక్షించారు. చెక్‌పోస్టులలో నిఘాను పెంచి అక్రమ మద్యం జిల్లాలోకి రాకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. రీజనల్ ఎక్సైజ్ ల్యాబ్‌ను, అందులోని పరికరాలను పరిశీలించి ల్యాబ్ పనితీరును సమీక్షించారు. రిపోర్టులు తయారైన వెంటనే సంబంధిత స్టేషన్లకు స్పెషల్ మెసెంజర్ల ద్వారా పంపాలన్నారు. జిల్లా కార్యాలయం ఆవరణం మొత్తం కలియదిరిగి ఎక్సైజ్ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం మాదవరం, ఛత్రగుడి చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

'బాల శక్తి పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలలకు కేంద్ర ప్రభుత్వం జాతీయ బాల శక్తి పురస్కారాలను అందిస్తున్నదని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పీ నిర్మల తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, ధైర్య సాహసాలు, క్రీడలు, కళలు – సంస్కృతి తదితర రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 31లోగా వెబ్‌సైట్ https://awards.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందిస్తారని తెలిపారు.



ఆంజనేయా.. అభయమివ్వు

హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 'ఆంజనేయ స్వామి.. అభయమివ్వు' అంటూ వేడుకున్నారు. అభిషేకాలు, పల్లకీ సేవలు నిర్వహించారు. సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఉపాధ్యాయ బదిలీలకు వేళాయె!

- ఈ నెల 27 వరకు దరఖాస్తులకు అవకాశం
- జూన్ 11 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి



కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీలకు విద్యాశాఖ సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా బదిలీలు చేసేందుకు ఇటీవలే షెడ్యూల్ జారీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధ్యాయుల బదిలీల కోసం టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్–2025 ను తీసుకొచ్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. 2023 మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టారు. రెండేళ్లకు జరుగుతున్న బదిలీలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 21 నుంచే దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. మొదటగా ప్రధానోపాధ్యాయులు, ఆ తరువాత స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, అనంతరం సెకండ్ గ్రేడ్ టీచర్లను బదిలీలకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు.

నిబంధనలు ఇవీ..

- ప్రధానోపాధ్యాయులు 5 ఏళ్లు, ఇతర కేటగిరీ టీచర్లు 8 ఏళ్ల పాటు ఒకే చోట పని చేస్తూ ఉంటే కచ్చితంగా బదిలీ కానున్నారు.
- స్టడీ లీవ్ పేరుతో సెలవుల్లో ఉన్న ఉపాధ్యాయులు(ఆగస్టులోపు) 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే బదిలీ కానున్నారు.
- విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ముందుగా ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులకు అవకాశం ఇవ్వగా, ఆ గడువు గురువారంతో ముగిసింది. స్కూల్ అసిస్టెంట్లకు ఈ నెల 24, ఎస్‌జీటీలకు ఈ నెల 27వ తేదితో ముగియనుంది.
- ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 24, స్కూల్ అసిస్టెంట్లకు 26,27, ఎస్‌జీటీలకు ఈ నెల 31వ తేదీన ప్రకటించనున్నారు.
- జాబితాలపై అభ్యంతరాలకు ఈ నెల 25న హెచ్‌ఎం, 28న ఎస్‌ఏ, 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఎస్‌జీటీలకు అవకాశం ఇచ్చారు.
- తుది సీనియారిటీ జాబితా ఖాళీలను హెచ్‌ఎంలకు ఈ నెల 27, ఎస్‌ఏలకు 31, ఎస్‌జీటీలకు జూన్ 6వ తేదిన ప్రదర్శించనున్నారు.
- బదిలీలకు ఆప్షన్లను హెచ్‌ఎంలకు ఈ నెల 28, ఎస్‌ఏలకు జూన్ 1,2, ఎస్‌జీటీలకు జూన్ 7నుంచి 10వ తేదీ వరకు గడువు ఇచ్చారు.
- హెచ్‌ఎంలకు ఈ నెల 30, ఎస్‌ఏలకు జూన్ 4, ఎస్‌జీటీలకు జూన్ 11వ తేదీన బదిలీలు ఇవ్వనున్నారు.

బదిలీలకు 8,042 పోస్టుల ఖాళీ

ఉమ్మడి కర్నూలు జిల్లాకు 15,564 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు అయ్యాయి. ఇందులో రెగ్యులర్ టీచర్లు 12,191 మంది, మినిమం టైం స్కేల్ టీచర్లు 361 మంది పని చేస్తున్నారు. డీఎస్సీ–2024 ద్వారా 2,645 మంది టీచర్లను భర్తీ చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్నారు. నూతన మార్గదర్శకాల ప్రకారం 16,898 మంది టీచర్ పోస్టులు అవసరం ఉంది. ఇటీవల విద్యాశాఖ విడుదల చేసిన జీఓ నంబరు 21 ప్రకారం వర్కింగ్ సర్‌ప్లస్ 499, ఖాళీల సర్‌ప్లస్ 1,194 టీచర్ పోస్టులు ఉన్నాయి. దీంతో పాటు ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల కొరత పోస్టులు 1,334, టీచర్లు 1,701 మంది ఉండగా, వివిధ మేనేజ్‌మెంట్లలోకి 344 పోస్టులను కన్వర్ట్ చేశారు. ఎస్‌జీటీ/స్కూల్ అసిస్టెంట్ పోస్టులని అధిగమించడం ద్వారా సృష్టించిన పోస్టుల సంఖ్య 100 ఉన్నాయి. బదిలీలకు ఉమ్మడి జిల్లాలో 8,042 పోస్టులను ఖాళీగా విద్యాశాఖ చూపుతోంది. ఇందులో క్లియర్ వెకేన్సీలు 2,766 ఉండగా, 8/5 అకడమిక్ ఈయర్స్ పూర్తి చేసుకున్న వారు 2,216 మంది టీచర్లు ఉన్నారు. ఇద్దరు టీచర్లు ఫారీన్ సర్వీస్‌లు ఉన్నారు. పునఃవిభజన ఖాళీలు(రీ–అపోర్సిమెంట్ ఖాళీలు) 1,486, స్టడీ లీవ్‌లో 25 మంది, కొత్తగా మంజూరై ఖాళీలుగా 1,547 ఉండగా, మొత్తం కలిపి 8,042 పోస్టులను ఖాళీలు విద్యాశాఖ చూపించింది.

వ్యవసాయ శాఖలో..

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన బదిలీలపై కర్నూలు, నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారులు పీఎల్ వరలక్ష్మి, మురళీకృష్ణ, పరిపాలన అధికారి, సూపరింటెండెంట్‌లు గురువారం సమావేశమై చర్చించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అటెండర్లు, డ్రైవర్లు, జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారుల బదిలీలు జరుగుతాయి. కొందరు 'కూటమి' నేతల సిపారస్సు లెటర్లు తెచ్చి కోరుకున్న చోటుకు బదిలీ అయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీల ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ జూన్ 2 వతేదీన ఉత్తర్వులు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యోగాంధ్రా కార్యక్రమాల నిర్వహణపై గురువారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 22వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక జిల్లాలో ఒక థీమ్‌తో స్టేట్ ఈవెంట్ యోగా సెషన్‌ను నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో జూన్ 17న 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో యోగా కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జూన్ 8న కర్నూలు, ఆదోని పత్తికొండ డివిజన్లలో సీనియర్ సిటీజన్లతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కొండారెడ్డి బురుజు, ఓర్వకల్లు రాక్ ఆర్డెన్, నగరవనం, మంత్రాలయంలలో మే 30, జూన్ 12, 18 తేదీల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో మే 26 నుంచి 30వ తేదీ వరకు వివిధ రకాల యోగా పోటీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు మండల స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. జూన్ 9 నుంచి 14వ తేదీ వరకు జిల్లాలో, జూన్ 21వతేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంరోజు ప్రతి కేటగిరిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి అవార్డులను ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు సందీప్ కుమార్, భరత్‌నాయక్ పాల్గొన్నారు.



అన్న క్యాంటిన్‌లోని అన్నాన్ని మురుగు కాలువలో వేసిన దృశ్యం

ఆకలి తీర్చని అన్న క్యాంటిన్!

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తుంటే వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంటోంది. ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఏర్పాటైన అన్న క్యాంటిన్ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడ తయారు చేసిన భోజనాన్ని పేదలకు అందించకుండా గురువారం మురుగు కాలువలో వేశారు. ఈ ఘటనపై ప్రజాసంఘాల నాయకులు కొందరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

– ఎమ్మిగనూరుటౌన్

శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైల జలాశయానికి సుంకేసుల నుంచి 8,690 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులు, మొత్తం జలాశయానికి ఇన్‌ఫ్లోగా 8,940 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. శ్రీశైల డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 817.20 అడుగులుగా నమోదైంది. అలాగే పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.0000 టీఎంసీలుగా నమోదైంది.

క్లుప్తంగా

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి

- స్పెషల్ ఆఫీసర్ మౌర్య భరద్వాజ్



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఆదోని సబ్‌కలెక్టర్, వైడబ్ల్యూసీఎస్ స్పెషల్ ఆఫీసర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. సొసైటీకి స్పెషల్ ఆఫీసర్‌గా నియామకమైన ఆయన మొదటి సారిగా గురువారం పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఉత్పత్తి కేంద్రాన్ని, గోదాంతో పాటు, విక్రయ కేంద్రం, డయింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. చేనేత ఉత్పత్తి,క్రయ విక్రయాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైడబ్ల్యూసీఎస్ పరిధిలోని చేనేత కార్మికులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత ఉత్పత్తుల్లో కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత జౌళిశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజారావు, వైడబ్ల్యూసీఎస్ కార్యదర్శి అప్పాజి, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయండి



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): 2014–19 మధ్య కాలంలో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని పీఆర్ ఇంజినీరింగ్ కమిషనర్ కోరారు. గురువారం ఆయన పీఆర్ ఎస్ఈలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్ ఎస్ఈ వీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న రూ.3 కోట్లకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని, ఇంకా 13 పనులకు సంబంధించిన రూ.6 లక్షల బిల్లులను మాత్రమే అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఇందులో కూడా నాలుగు బిల్లులు ఎస్ఎస్ఏకు సంబంధించినవి ఉన్నాయని, మిగిలిన వాటిలో 9 బిల్లులను కూడా అప్‌లోడ్ చేశామన్నారు. సాంకేతిక కారణాలతో రూ.58 వేల బిల్లును మాత్రమే అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ గూగుల్ మీట్‌లో ఎస్ఈ పీఏ బండారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాములపాడు: జూటూరు గ్రామానికి చెందిన గోరపూటి సత్యం(48) కేసీ కాలువ గట్టుపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం మేరకు ఎస్ఐ సురేష్‌బాబు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: గుర్తు తెలియని వ్యక్తి కర్నూలు రైల్వే స్టేషన్‌లో మృతిచెందాడు. రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మాధవ స్వామి మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదమా లేదంటే సాధారణ మరణమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. మృతి చెందని వ్యక్తి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుంది. కాషాయం రంగు టవల్, తెలుగు రంగు చొక్కా ధరించాడు. కుడి చేతిపైన 96975368 అనే సంఖ్యలు గల టాటూ మార్కు ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9030481295, 9441802327కి సమాచారం అందించాలన్నారు.



బేతంచెర్ల: శోభాయాత్రలో వీర హనుమాన్ వేషధారణ



కర్నూలు: చాణక్యపురి కాలనీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో చెరుకుగడల పందిరి



కొలిమిగుండ్ల: మీర్జాపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



శ్రీశైలం: ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి

అంజనీ పుత్ర నమోస్తుతే!

హనుమాన్ జయంతి వేడుకలు ఊరూరా వైభవంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జాము నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పలు చోట్ల శోభాయాత్ర చేపట్టారు. జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలు హోరెత్తాయి. కళాకారుల ప్రదర్శనలు, భజనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం రథోత్సవాలు నిర్వహించి స్వామివారిని కనులారా దర్శించుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదోని రణమండల ఆంజనేయ స్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం



నంద్యాల: పట్టణంలో వీర హనుమాన్ శోభాయాత్ర



కోడుమూరు: వెంకటగిరిలో గిద్దాంజనేయ స్వామి రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం



పాణ్యం: తమ్మరాజుపల్లె ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల భజన

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి

- ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని చిన్ననీటి పారుదల చెరువులకు సంబంధించి మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో చిన్న నీటిపారుదల పనులకు సంబంధించి మరమ్మతులు, పునరుద్ధరణ, ఇతర పనులపై ఇరిగేషన్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్‌స్కీం కింద చిన్న నీటి పారుదల చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఈ స్కీంలులో చేపట్టే పనులకు కేంద్రం 60 శాతం,రాష్ట్రం 40 శాతం నిధుల ను కేటాయిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి చెరువులను గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఎంఐవర్క్ డివిజన్ ఈఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, గ్రౌండ్ వాటర్ డీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు తెలియకుండా నిధుల డ్రా

- అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం



మాట్లాడుతున్న సర్పంచ్ రెహమాన్

పత్తికొండ: గ్రామాల్లో టీడీపీ నాయకుల అండ చూసుకొని సర్పంచ్‌లకు తెలియకుండా కొందరు నిధులుడ్రా చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని పలువురు సర్పంచ్‌లు మండిపడ్డారు. పత్తికొండ మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నారాయణ దాస్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దూదేకొండ సర్పంచ్ ముజఫర్ రెహమాన్ మాట్లాడుతూ.. తన గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్రమంగా నిధులు డ్రా చేశారని, ఈ విషయం అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సర్పంచ్‌లతో సంబంధం లేకుండా నిధులు డ్రా చేసే అధికారం కొత్తగా కూటమి ప్రభుత్వం ఏమైనా ఉత్తర్వులు ఇచ్చి ఉంటే చూపాలని కోరారు. సమస్యలపై అధికారులు చర్చించి చర్యలు చేపడతామని ఎంపీడీవో కవిత, ఎంపీపీ దాస్ తెలిపారు. వైస్ ఎంపీపీ రంగమ్మ, మేజర్ పంచాయతీ కార్యదర్శి నరసింహులు, వైఎస్ఆర్‌సీపీ ఎంపీటీసీలు నీలకంఠ, కేశప్ప, పెద్దవీరన్న, కృష్ణారెడ్డి, లక్ష్మి, మహలక్ష్మి, సర్పంచ్‌లు ప్రవీణ, కేశవరెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

422 మంది విద్యార్థుల గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 422 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 3913 మందికి 3499 మంది హాజరు కాగా 414 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 75 మందికి 67 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం నలుగురు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు తెలిపారు.

నెలరోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

- యువతి ప్రాణం తీసిన విద్యుదాఘాతం



మృతి చెందిన శభేరా (ఫైల్)

ఆస్పరి: నెలరోజులకు పెళ్లి కావాల్సిన యువతి విద్యుదాఘాతంతో మృతి చెందారు. దీంతో ఆస్పరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆస్పరిలో గురువారం కుళాయిలకు నీటిని సరఫరా చేశారు. పింజరి శభేరా (20) అనే యువతి కుళాయికి విద్యుత్ మోటారు వేసే సమయంలో విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆస్పరికి చెందిన పింజరి కాశన్న, బీబీ దంపతులకు నలుగురు కుమార్తెలు. వీరిలో ఇప్పటికే ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. మూడో కుమార్తె శభేరాకు మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈమేరకు గత 15రోజులకు క్రితం ఆస్పరిలో నిశ్చితార్థం కూడా చేశారు. జూన్ 22, 23వ తేదీల్లో పెళ్లి జరిగేలా కుటుంబ సభ్యులు నిశ్చయం చేసుకున్నారు. ఇంతలోనే విషాదకరమైన ఘటన జరగడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కంటతడి పెట్టారు.

చట్టాలపై అవగాహనతోనే న్యాయవాద వృత్తిలో రాణింపు

- జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మను సన్మానిస్తున్న లా కళాశాల సిబ్బంది

కర్నూలు (సిటీ): చట్టాలపై అవగాహనతోనే న్యాయవాద వృత్తిలో రాణించవచ్చునని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ అన్నారు. 'కెరీర్ ప్రాస్పెక్ట్స్ ఇన్ లా' అనే అంశంపై స్థానిక ఓ న్యాయ కళాశాలలో జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లా విద్యార్థులు కోర్సు సమయంలోనే చట్టాలపై పరిజ్ఞానం పెంచుకుంటే కోర్టులలో సమర్థవంతంగా వాదించడానికి, సాక్షులను క్రాస్ ఎగ్జామ్ చేయడానికి ఉపకరిస్తుందన్నారు. సమాజంలో న్యాయవాద వృత్తికి ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రతి ఒక్కరూ న్యాయ సహాయం పొందేందుకు న్యాయవాదులను సంప్రదిస్తారన్నారు. చట్టాలపై అవగాహనతో పాటు ఆంగ్ల భాషపై ప్రావీణ్యం సాధించడం కూడా ముఖ్యమేనని తెలిపారు. ప్రసూనా న్యాయ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన కర్నూలును విద్యాపరంగా అభివృద్ధిపరిచేందుకు తాను 1999లో కర్నూలులో న్యాయ కళాశాలను ప్రారంభించి వేలాది మందిని న్యాయవాదులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. సీనియర్ న్యాయవాది శ్రీనివాసులు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో రాణించాలంటే కష్టపడి పనిచేసే తత్వం అలవరుచుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివాజీరావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచేందుకు పలు వెబ్‌సైట్లు సెమినార్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ జేవీ శివకుమార్, జూనియర్ న్యాయవాదులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమల మీదుగా 'నంబాల'



నంబాల కేశవరావు(ఫైల్)

ఆత్మకూరురూరల్: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజ్ ఎన్‌కౌంటర్‌లో బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఈయన పలు మార్లు, పలు హోదాల్లో నల్లమలలో పర్యటించారని మాజీ మావోయిస్టులు గుర్తు చేసుకుంటున్నారు. పీపుల్స్‌వార్ పార్టీ కేంద్ర కమిటీలోకి నంబాల కేశవరావు వచ్చిన తరువాత 1991లో నల్లమలకు వచ్చినట్లు కొందరు మాజీ మావోయిస్టులు తెలిపారు. 1995లో నల్లమలలో జరిగిన రాయలసీమ – దక్షిణ కోస్తా రీజినల్ మిలటరీ క్యాంప్‌నకు హాజరైనట్లు, 1997లో నల్లమల అడవిలో ఆయన పర్యటించినట్లు గుర్తు చేశారు. పీపుల్స్‌వార్ ఆంధ్ర రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 1998లో నల్లమలలో జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో కూడా పాల్గొన్నట్లు చెప్పారు. చిట్టచివరి సారిగా నల్లమలకు 2003లో ఏపీ రాష్ట్ర కమిటీ ప్లీనంలో పాల్గొనేందుకు వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు.

లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- ఒకరు మృతి



డోన్ టౌన్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లారీ క్లీనర్ గోపి చంద్ అలియాస్ చంటి(25)మృతి చెందాడు. లారీ డ్రైవర్ అమీర్, బస్సు డ్రైవర్ భాస్కర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రయాణికులు హేమ, మహిధర్‌తో పాటు మరికొంత మందికి స్వల్ప గాయాలు అయ్యినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత (గురువారం తెల్లవారు జాము 1గంట దాటిన తరువాత) అనంతపురం నుంచి కర్నూలు వైపుకు వెళుతున్న లారీ టైర్ పంక్చర్ అయ్యింది. జాతీయ రహదారిపై యు.కొత్తపల్లె వద్ద ఉన్న బ్రిడ్జి వద్ద లారీని ఆపారు. క్లీనర్ చంటి లారీ టైర్ల కింద రాళ్లు పెట్టడానికి ఉండగా కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్‌కు వెళ్తూ ఢీ కొట్టింది. లారీ వెనుక నిలబడి ఉన్న చంటి నలిగి పోయి అక్కడికక్కడే మృతి చెందారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కేవీ రమణారెడ్డి

వెల్దుర్తి: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ కేవీ రమణారెడ్డి అన్నారు. పీఎమ్ఆర్ఎమ్ఈ కింద, ఎస్‌బీఐ సౌజన్యంతో పట్టణ సభ్యురాలు లక్ష్మీదేవి తీసుకున్న ఆయిల్ మిషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి పొదుపు సభ్యురాలు జీవనోపాధులను మెరుగు పరుచుకోవాలన్నారు. కుటుంబ అవసరాలకు కిచెన్ గార్డెన్ తదితరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీపీఎంలు నర్సమ్మ, నవీన్, ఏపీఎం అనురాధ, హెచ్‌డీ ఏపీఎం వెంకటస్వామి, ఉన్నతి ఏపీఎం కాశేశ్వరుడు, సీసీలు పాల్గొన్నారు.

'ఎక్సైజ్' సమస్యలు పరిష్కరించండి



మెమొంటో అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: జిల్లా ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. జిల్లా ఎక్సైజ్ శాఖలో 135 మంది కానిస్టేబుళ్లు ఉండగా, కేవలం 61 మంది మాత్రమే ఉన్నారని, సిబ్బంది కొరత వల్ల ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగి ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను చేపట్టి సిబ్బందిపై పనిభారం తగ్గించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రంలో కోరారు. ఎస్ఐలు సందీప్, సోమశేఖర్, నవీన్, రెహనా బేగం తదితరులు కూడా రాహుల్ దేవ్ శర్మను కలసిన వారిలో ఉన్నారు.

26న మత్స్య వాహనాల వేలం

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్య శాఖలో కాలం చెల్లిన ఐదు వాహనాలను ఈ నెల 26వ తేదీన వేలం వేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రంగనాథ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహీంద్ర కమాండర్ జీపు, టాటా ఆల్విన్ 407, మహీంద్ర వ్యాన్, మినీ బస్సు, మహేంద్ర జీపు మొత్తం 5 వాహనాలను వేలం వేస్తామని పేర్కొన్నారున. సాయంత్రం 3 గంటలకు బంగారుపేటలోని మత్స్య క్షేత్రంలో వేలంపాట జరుగుతుందని, ఆసక్తి ఉన్న వాళ్లు పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు సహాయ మత్స్య పర్యవేక్షకులను సంప్రదించాలని కోరారు.

ఖాళీ కుర్చీల 'మహా'నాడు

- డోన్ ఎమ్మెల్యే కోట్ల డుమ్మా
- ఆర్భాటపు ప్రసంగాలతో మమ అనిపించిన నేతలు
- వెక్కిరించిన ఖాళీ కుర్చీలు



మహానాడులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



ప్రసంగం వినకుండా కబుర్లు చెప్పుకుంటున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో గురువారం నిర్వహించిన నంద్యాల జిల్లా స్థాయి మహానాడులో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వేలాది మంది కార్యక్రమానికి హాజరవుతారని భావించిన నిర్వాహకులకు నిరాశ ఎదురైంది. మూడు షెడ్లలో ఏర్పాటు చేసిన మహానాడుకు ఒక్క షెడ్డులో మాత్రమే కార్యకర్తలు కూర్చోవడంతో మిగిలిన రెండు షెడ్లలో ఖాళీ కుర్చీలు కనిపించాయి. భారీగా పార్టీ శ్రేణులు వస్తారని భావించిన నిర్వాహకులు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో చేసేదేమీ లేక నాయకులు ఆర్భాటపు ప్రసంగాలతో అదరగొట్టారు. ఈ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి గైర్హాజరయ్యారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తమ నియోజకవర్గానికి నిధులు మంజూరు కాలేదంటూ డోన్ నియోజకవర్గ నాయకులు ధర్మారం సుబ్బారెడ్డి సభ దృష్టికి తేవడం చర్చనీయాంశమైంది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి కమిటీలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన పొగాకును కంపెనీలు కచ్చితంగా కొనుగోలు చేస్తారని, నాణ్యత లేని పొగాకు విషయంలో రైతులు కొంత రాజీ పడక తప్పదనానరు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆర్‌ఐసీ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డిలు సభ మధ్యలోనే వెళ్లిపోయారు. కార్యక్రమంలో మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, జయసూర్య, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.